క్లుప్తంగా

నేటి నుంచి వీధి నాటకం

చిన్నచింతకుంట: ఉగాదిని పురస్కరించుకొని అమ్మపురంలో శ్రీ కురుమూర్తి నాటక మండలి ఆధ్వర్యంలో కురుమూర్తి స్వామి జీవిత చరిత్ర వీధి నాటకం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు జెట్టెం మధు, బాల్‌రాం, దశరథలు వివరాలు తెలిపారు. గురువారం రాత్రి 8 గంటలకు నాటకం ప్రారంభమై శనివారం రాత్రి ముగుస్తుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనను మండలంలోని కురుమూర్తి స్వామి భక్తులు తిలకించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పేర్కొన్నారు. ఈమేరకు ఎంవీఎస్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ 7 యూనిట్‌ల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్‌ఐ రవి, ఏఎస్‌ఐ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలు పెంపొందించాలి

గండేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిలో చదవడం, రాయడం వంటి కనీస సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. బుధవారం లింగాయపల్లి పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి నోట్ పుస్తకాలను పరిశీలించి పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించాలని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యతతో విద్యార్థులకు వడ్డించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పెద్దమందడి మండలానికి చెందిన సందీప్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు గమనించి ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై అడ్డాకుల పోలీసులు విచారణ చేపట్టారు.

హోటల్‌పై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం: న్యూటౌన్‌లో ఉన్న ఓ హోటల్ నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించక పోవడం వల్ల దాని నుంచి వచ్చే వ్యర్థాలు, పొగతో రోగాల బారినపడుతున్నామని.. ఓ బాధితుడు షేక్ ముస్తాక్ ఇమామ్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కాగా బాధితుడు పలుమార్లు హోటల్ నిర్వాహకులకు విషయంపై చెప్పినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించాడు.

స్థలం కేటాయించండి



బాలానగర్: మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు నిధులు కేటాయించాలని నాయకులు అన్నారు. ఈ మేరకు కొండకళ్ల విష్ణు ఆధ్వర్యంలోని అంబేడ్కర్ సంఘం నాయకులు హైదరాబాద్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి బుధవారం వినతి పత్రం అందజేశారు.

వేతనాలు విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయితీ కార్మికుల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ రవినాయక్, డీఎల్‌పీఓ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మైబు, నారాయణ, తిరుపతయ్య, నాగన్న ఉన్నారు.

ఎన్నికల తర్వాత బదిలీలు

గండేడ్: ఎన్నికల అనంతరం ప్రభుత్వంతో మాట్లాడి బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చేలా చూస్తామని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకరయ్య పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. టెట్‌తో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇచ్చేలా కృషిచేస్తామన్నారు. శంకరయ్యను ఉపాధ్యాయబృందం తదితరులు ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కమలాకర్‌రావు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, ప్రధానకార్యదర్శి రఘురాం రెడ్డి, గౌరవాధ్యక్షుడు గోపాల్‌నాయక్, రాష్ట్ర బాధ్యులు రవీందర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, బీజేపీ నేత వెన్న ఈశ్వరప్ప పాల్గొన్నారు.

నీటి సమస్య రానివ్వొద్దు



గండేడ్‌లో సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు

మిడ్జిల్: వేసవి కాలంలో ఎండల తీవ్రత పెరగిన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వకుండా చూసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులకు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యాలయాలలో కుండలు ఏర్పాటు చేయాలని, అలాగే ఉపాధిహామీ పనుల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ అనురాధ పాల్గొన్నారు.

నవాబుపేట: గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండ చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా సంబంధిత శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించాలని నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ బద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమీయుల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

గండేడ్: మండల స్పెషల్ ఆఫీసర్ పాండు బుధవారం పంచాయతీ కార్యదర్శులతో గండేడ్‌లో నీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. నీటి సమస్య తలెత్తకుండా స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడ లీకేజీలు ఉన్నా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, ఇంట్రా ఏఇ మద్దిలేటి, ఎంపీఈఓ శంకర్ నాయక్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో..



మిడ్జిల్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటేష్

కురుమ, యాదవులను ఆదుకుంటాం



సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కురుమ, యాదవులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో బుధవారం కురుమ, యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం యాదవుల బాగుకోసం ఆలోచించలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులు ధర్మంవైపు నిలిచి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. గతంలో గొర్రెల కోసం కట్టిన డీడీల విషయమై సీఎంను ఒప్పించి ఇప్పించే ప్రయత్నం చేశామని, అధికారులు ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించి డబ్బులను జమచేస్తారని తెలిపారు. యాదవుల అభ్యున్నతి కోసం ఎన్నికల అనంతరం ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతి ఇద్దామని కోరారు. కాంగ్రెస్ మన అభివృద్ధికి బాటలు వేస్తుందని, పార్టీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఎన్‌పీ.వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, శాంతన్న యాదవ్, కృష్ణయ్య యాదవ్, రాములు యాదవ్, రమేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, గోవింద్ యాదవ్, వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాల కల్పన

దేవరకద్ర: ఎండలు మండిపోతున్న నేపథ్యంలో బుధవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, టెంట్లను ఏర్పాటు చేశారు. దేవరకద్ర మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న మల్లెల పాపయ్య కుంటలో జరుగుతున్న పనుల వద్ద ఈ మేరకు చర్యలు చేపట్టారు. కాగా పనుల్లో భాగంగా కుంటలో పేరుకు పోయిన సిల్ట్‌ను తవ్వి కట్టను బలోపేతం చేస్తున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్ల ద్వార ఒండ్రుమట్టిని తమ పొలాలకు తరలిస్తున్నారు.



పనుల వద్ద ఏర్పాటు చేసిన టెంట్, తాగునీరు

కనీస సౌకర్యాలు కరువు



మిడ్జిల్‌లో పశువుల సంత

- పశువుల సంతలో ఇబ్బందులు
- మండుటెండలోనే సాగుతున్న క్రయవిక్రయాలు
- మూగజీవాలకు కరువైన తాగునీరు

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారాంతపు పశువుల సంతలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పశువుల సంతలో ప్రతి వారం దాదాపు వేల సంఖ్యలో గొర్రెలు, మేకల విక్రయాలు కొనసాగుతుంటాయి. దేవరకొండ, కర్నూల్‌తో పాటు సుదూర ప్రాంతాల వారు సైతం పాల్గొంటుంటారు. ఆటోలలో, డీసీఎంలలో గొర్రెలను, మేకలను తెచ్చి విక్రయిస్తుంటారు. కాగా అందుకు తగ్గట్టుగా సంతలో సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. దీంతో ప్రతి వారం ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడకు వచ్చేవారు చెబుతున్నారు. మూగజీవాలు తాగేందుకు కూడా నీరు ఉండడం లేదని చెబుతున్నారు. సంతలో విక్రయించే జంతువును బట్టి రూ. 50 చొప్పున తైబజారు వసూలు చేస్తున్నారు కానీ వసతులు మాత్రం ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎండకాలం నేపథ్యంలో మూగ జీవాల కోసం తాత్కాలిక షెడ్లు కూడా ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు. దీంతో వివిధ మండలాల నుంచి పశువులను కొనుగోలు చేయుటకు వచ్చే రైతులు, వ్యాపారులు ఎండ కాలంలో గొర్రెలకు, మేకలతో పాటు నిలువ నీడలేక, తాగేందుకు నీరు దొరకక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంవెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎండ కాలం ఉండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎండలో నిల్చొనే క్రయవిక్రయాలు చేయాల్సివస్తోంది. మూగజీవాలకు సైతం తాగేందుకు నీరు లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. నీటి తొట్లు, తాత్కాలిక షెడ్లు వంటివి ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి.

–అశోక్, వ్యాపారి, మిడ్జిల్

పరిష్కరిస్తాం

ఎండ కాలం దృష్టిలో పెట్టుకొని పశువుల సంతలో మూగ జీవాలకు తాగునీటి ఇబ్బంది లేకుండ చర్యలు తీసుకుంటాం. అవసరమైన మేరకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తాం. గతంలో ఏర్పాటు చేసిన వాటిని కొందరు ధ్వంసం చేయడం వల్ల ఇబ్బంది కలుగుతోంది.

–సాయన్న, పంచాయతీ కార్యదర్శి, మిడ్జిల్

'మాజీ మంత్రిని అందుకే ఓడించారు'

స్టేషన్ మహబూబ్‌నగర్: నియోజకవర్గంలో నియంతలా ప్రవర్తించినందుకే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ప్రజలు ఓడగట్టారని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన వ్యక్తిత్వం ప్రజలకు తెలుసన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గురించి మాజీ మంత్రి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రిని ఓడగొట్టింది బీసీలు, బహుజనులేనని గుర్తుచేశారు. ఇప్పటికై నా తన అహంకార వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు పాపారాయుడు, అంజద్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ అందజేత



దేవరకద్ర: లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు వీలుగా శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. విద్యాభివృద్ధి కోసం ఫౌండేషన్ నిరంతరం పని చేస్తుందని దేవరకద్ర బ్లాక్ కో ఆర్డినేటర్ జగ్గప్ప తెలిపారు. ఈఎస్ రామ్మూర్తి నేతృత్వంలో ప్రేరణ, ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. మెరుగైన ఫలితాలు సాధించిన లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, అస్రకాద్రి, కల్పన, బాసిద్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి మట్లాడుతూ సుదూరప్రాంతాల నుంచి వచ్చేవారి దాహార్తి తీర్చడం కోసం చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, తహసీల్దార్ తిరుపతయ్య, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రాధారెడ్డి. బుచ్చిబాబు, అక్బర్, వేణు, అశోక్, రహీం, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభించిన కలెక్టర్



అంబలి కేంద్రం వద్ద కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని కలెక్టర్ జి.రవినాయక్ బుధవారం ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చిన వారికి అంబలి వితరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్ భవన సముదాయానికి వచ్చే ప్రజల కోసం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న మెట్టుసాయికుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో మత్స్యకారులు, ముదిరాజ్‌ల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ మత్స్యకార విభాగం అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మత్స్యకారుల సంక్షేమానికి చేసిందేమిలేదన్నారు. మత్స్యకారులు, ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని, మూడు అసెంబ్లీ సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ముదిరాజ్, గంగపుత్ర కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యకార, ముదిరాజ్ కుటుంబాలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఉచిత చేపల పెంపకంలో నిలువు దోపిడీ జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 సీట్లు గెలుస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి మత్స్యకారులు, ముదిరాజ్‌లు అండగా ఉన్నారని 2లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా మత్స్యకార విభాగం ఇన్‌చార్జీలను నియామకం చేశారు. మహబూబ్‌నగర్‌కు గంజి ఆంజనేయులు, రవి, దేవరకద్రకు సంద వెంకటేష్, తెలుగు వెంకటేశ్, నారాయణపేటకు పటేల్ శ్రీనివాస్, కాశీనాథ్, జడ్చర్లకు ఆనంద్, కొడంగల్‌కు రెడ్డి శ్రీనివాస్, షాద్‌నగర్‌కు శ్రీశైలం, గోపాల్, సత్తయ్య, శ్రవణ్‌కుమార్‌లను నియమించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లిటిల్‌రోజ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన యానివల్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్న కోరిక, పక్క ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధిస్తారని.. సమయ పాలన, క్రమశిక్షణ, విద్యార్థులను లక్ష్యానికి మరింత చేరువ చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, బెక్కం జనార్దన్, ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్, సీఎంఓ బాలుయాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జీకే మాస్టర్ కరాటే దూ ఇండియా వీబీపీ బ్లాక్‌బెల్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని హమ్మింగ్ బర్డ్స్ స్కూల్‌లో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు సీనియర్ కరాటే మాస్టర్ ఇలియాజ్ బిన్ సిద్దిఖీ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. స్కూల్ కరస్పాండెంట్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని కోరారు. ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో నేర్చుకోవాలని కోరారు. కరాటే మాస్టర్ సయ్యద్ అశ్వాక్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు గ్రీన్ బెల్టు, ఇద్దరు మెరూన్ బ్రౌన్, 6గురు ఎల్లో బెల్టులు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేజోమయి, మాస్టర్లు అశ్వాక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కౌకుంట్లలో ఇఫ్తార్ ఏర్పాటు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు



జిల్లాకేంద్రంలో..

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని జామియా మసీదులో బుధవారం సాయంత్రం ముస్లింకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ స్వప్న, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కిషన్‌రావు ఆధ్వర్యంలో విందు ఇచ్చారు. మసీదులో 30 రోజుల పాటు నమాజ్ చదివిస్తున్న ఇమామ్ సాబ్‌ను ఘనంగా సన్మానించారు. ముస్లిం పెద్దలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్‌ను పురస్కరించుకొని పట్టణంలో ఇఫ్తార్‌లు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం స్థానిక 25వ వార్డులో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షులు ఎండి.ఫయాజ్ ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్‌పీ.వెంకటేశ్, బెక్కరి అనిత, ఏపీ.మిథున్‌రెడ్డితోపాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే యెన్నం పాల్గొన్నారు. సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, గౌస్ తదితరులు ఉన్నారు. షాసాబ్‌గుట్టలోని మజీదే అబ్దుల్‌రజాక్‌లో ఏర్పాటు చేసిన విందులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. మసీద్ కమిటీ సభ్యులు హనీఫ్, జమీలుద్దీన్, అంజద్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల 'మలుపు'లు..!



పొన్నకల్ దారిలో ప్రమాదకర మలుపు



కన్మనూర్ రోడ్డులో..

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్, పొన్నకల్ గ్రామాలకు వెళ్లే దారిలో బీటీరోడ్లపై ప్రమాదకర మలుపులు ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి పొన్నకల్ గ్రామానికి వెళ్లే దారిలో చెరువు కట్ట వద్ద రోడ్డు పెద్ద మలుపు తిరిగి ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మలుపు వద్ద వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు లేకపోలేదు. కాగా బలీదుపల్లి నుంచి కన్మనూర్ వెళ్లే దారిలో ఇలాంటి మలుపే ఉంది. అక్కడ కూడా ఎలాంటి హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల ఇక్కడ కూడా ప్రమాదాలు జరిగి పలువురు గాయపడిన సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర మలుపుల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణీకులు విజ్ఞప్తి చేస్తున్నారు.